# కత్తులు దూస్తున్న కాంగ్రెస్

## తన మార్క్ రాజకీయానికి తెరతీసిన హస్తంపార్టీ

- గతంలో ఎన్నడూలేని విధంగా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో హింస
- కత్తులతో తిరుగుతున్న కాంగ్రెస్ నేతలు
- బీఆర్ఎస్ అభ్యర్థులు, కార్యకర్తలపై దాడులు
- ఇప్పటికే ఆరుగురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడి
- పట్టపగలే బోధన్ ఎమ్మెల్యే షకీల్‌పై దాడి
- అడ్డొచ్చిన బీఆర్ఎస్ శ్రేణులపైనా పిడిగుద్దులు
- అప్పుడే రౌడీయిజం చూపిస్తున్న కాంగ్రెస్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ తన మార్క్ రక్తపాత రాజకీయాన్ని మొదలుపెట్టింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల్లో హింసను ప్రోత్సహిస్తున్నది. బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై కత్తి దాడులకు తెగబడుతున్నది. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా ఆరు కత్తి దాడి ఘటనలకు కాంగ్రెస్ ఒడిగట్టింది. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడితో రక్తపాతాన్ని మొదలుపెట్టిన హస్తం పార్టీ.. ఆ దాడుల పరంపరను కొనసాగిస్తున్నది. బుధవారం ఒక్కరోజే మంథని, నకిరేకల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు కత్తులతో దాడులు చేశారు. కాంగ్రెస్ నేతల దాడుల ఘటనలను పరిశీలిస్తే.. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తి దాడి జరిగింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు హైమద్, రజాక్, జావెద్‌పై కాంగ్రెస్ నేత భీమ్‌దాస్ కత్తిపోట్లతో తెగబడ్డారు. మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత బక్కరావ్ బీఆర్ఎస్ నేత రాజిరెడ్డిపై కత్తితో దాడి చేశారు. అంతేకాదు సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ అభ్యర్థి పుట్టమధును కూడా హెచ్చరించారు. నకిరేకల్ నియోజకవర్గంలో సురేశ్ అనే బీఆర్ఎస్ కార్యకర్తపై వేముల వీరేశం అనుచరులు కత్తితో దాడికి దిగారు. అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాల్‌రాజ్‌పైనా దాడికి దిగారు. కొల్లాపూర్‌లో స్వతంత్ర్య అభ్యర్థి శిరీష(బర్రెలక్క), ఆమె తమ్ముడిపైనా దాడిచేశారు.

## వరుస దాడులు.. రక్తపు మరకలు

**గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడా కర్ఫ్యూలు లేవు, అల్లర్లు లేవు. ఇప్పుడు ఎన్నికల వేళ కాంగ్రెస్ రాజకీయ దురాశకు రాష్ట్రం మళ్లీ ఉమ్మడి రాష్ట్రాన్ని తలపిస్తున్నది. వరుస కత్తి దాడులతో రక్తపు మరకలు అంటుతున్నాయి. ఎక్కడో ఒకటి జరిగిందంటే అనుకోకుండా జరిగిందని అనుకోవచ్చు. కానీ రోజుల వ్యవధిలోనే ఆరుగురికి కత్తిపోట్లు పడ్డాయంటే ఇది పక్కా కుట్ర అని స్పష్టమవుతున్నది. ఇలాంటి కుట్రలు, రక్తపాతాలు కాంగ్రెస్ పార్టీకి కొత్తేమి కాదు.**

సొంత పార్టీ సీఎంను కుర్చీ నుంచి దించేందుకు హైదరాబాద్‌లో రక్తపాతానికి తెగబడ్డ హీనమైన చరిత్ర కాంగ్రెస్‌ది ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. 1990లో హైదరాబాద్‌లో జరిగిన మతకల్లోలాల వెనుక తమ పార్టీకి చెందిన కొందరి హస్తం ఉన్నదని నాటి ఆ పార్టీ సీఎం చెన్నారెడ్డే స్వయంగా చెప్పటం ఆ పార్టీ రక్తదాహానికి నిదర్శనం. ఇప్పుడు మళ్లీ అలాంటి ఘటనలను రాష్ట్రంలో పునరావృతం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నది.

### కడుపులో కత్తులు పెట్టుకొని తిరుగుతున్నరు

ఇప్పటి వరకు జరిగిన ఏ సంఘటనా యాదృచ్ఛికంగా జరిగింది కాదని, పక్కా ప్లాన్ ప్రకారమే జరిగినట్టు స్పష్టం అవుతున్నది. అంటే.. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో కత్తులు వెంటబెట్టుకొని తిరుగుతున్నారని తేలిపోయింది. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమి ఖాయమైంది. దీన్ని తట్టుకోలేక ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంయమనం కోల్పోతున్నారు. అందుకే ప్రత్యర్థులపై దాడులకు దిగుతూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలు, ఓటర్లను తమ దారికి తెచ్చుకొనేందుకు ఇలా దాడులకు తెగబడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఇవీ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల దాడులు:

- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేశారు.
- ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు హైమద్, రజాక్, జావెద్‌పై కాంగ్రెస్ నేత భీమ్‌దాస్ కత్తిపోట్లు
- మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత బక్కరావ్ బీఆర్ఎస్ నేత రాజిరెడ్డిపై కత్తితో దాడి చేశారు. అంతేకాదు సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ అభ్యర్థి పుట్టమధును కూడా హెచ్చరించారు.
- నకిరేకల్ నియోజకవర్గంలో సురేశ్ అనే బీఆర్ఎస్ కార్యకర్తపై వేముల వీరేశం అనుచరులు కత్తితో దాడిచేశారు.
- అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాల్‌రాజ్‌పైనా కాంగ్రెస్ నేతలు దాడికి దిగారు.
- కొల్లాపూర్‌లో స్వతంత్ర్య అభ్యర్థి శిరీష(బర్రెలక్క)పై, ఆమె తమ్ముడిపైనా దాడికి తెగబడ్డారు.

### ఇది శాంపిల్ మాత్రమే!

కాంగ్రెస్ నేతలు ఇప్పటి వరకు చేసిన దాడులు శాంపిల్ మాత్రమేనని, ఇక ముందు ఇలాంటివి చాలానే జరుగుతాయని రాజకీయ విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే తెలంగాణ రావణ కాష్టంగా మారటం ఖాయమనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కుట్రలు, కత్తులు, రక్తపు మరకలతో సావాసం చేసే కాంగ్రెస్‌ను ఆదరిస్తే అధోగతి తప్పదని హెచ్చరిస్తున్నారు. ఆ పార్టీ రాష్ట్రానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినా తమకు కాంగ్రెస్సే కావాలనుకుంటే జరగబోయే ప్రమాదాలను తట్టుకొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

## బరితెగించిన కాంగ్రెస్

- బోధన్ ఎమ్మెల్యే షకీల్ వాహనంపై దాడి
- అడ్డుపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తలపైనా ముష్టిఘాతాలు
- నియోజకవర్గంలో కాంగ్రెస్‌తో కుమ్మక్కైన బీజేపీ నాయకులు
- నన్ను ఖతం చేసేందుకే కాంగ్రెస్ కుట్ర
- మీడియాతో బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్

బోధన్, నవంబర్ 22: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బరితెగింపు రాజకీయాలకు పాల్పడుతున్నది. ఈ సారి ఏకంగా బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌పై దాడికి దిగింది. కాంగ్రెస్ నేతలకు బీజేపీ కార్యకర్తలు కూడా తోడవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి మండలంలో షకీల్ బుధవారం ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఏఆర్‌పీ క్యాంప్, బ్రహ్మణ్‌పల్లి, జైతాపూర్‌లో ఆయన్ను అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో జైతాపూర్‌లో ఎడపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డీ శ్రీరామ్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. అప్పటికీ బీఆర్ఎస్ శ్రేణులు శాంతియుతంగానే ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల్లో గొడవలు సృష్టించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సాటాపూర్ గేట్ వద్దకు చేరుకుని పథకం ప్రకారం అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి పలువురిని తీవ్రంగా గాయపర్చారు. ఈలోగా అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే షకీల్ వాహనంపైనా దాడి చేశారు. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. కాంగ్రెస్ నాయకులు, వారి గూండాలు తనపై రాళ్లు, రాడ్లు, కత్తులతో దాడిచేసేందుకు వచ్చారంటూ, తనను హత్య చేసేందుకు కుట్ర జరిగిందని షకీల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కాంగ్రెస్ దాడిలో బీఆర్ఎస్‌కు చెందిన ఎడపల్లి ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఎడపల్లి వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, మోసీన్, మహబూబ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానకు తరలించారు. బాధితులను షకీల్ పరామర్శించారు.

### నన్ను హత్యచేసేందుకు కుట్ర..

తనను పథకం ప్రకారం హత్య చేసేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్ర పన్నారని, అదృష్టవశాత్తు ఆ కుట్ర నుంచి బయటపడ్డానని షకీల్ అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఓడిపోతున్నట్టు తెలిసి, నిరాశ, నిస్పృహతో తనపై, తన అనుచరులపైనా విచక్షణారహితంగా దాడులు చేసేలా కాంగ్రెస్ నాయకులను ఉసిగొల్పారని విమర్శించారు. శరత్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు, కాంగ్రెస్ నాయకుడు పులి శ్రీనివాస్, జైతాపూర్ సర్పంచ్ రామగోపాల్‌రెడ్డి, ఆ గ్రామానికి చెందిన నారాయణ, బోధన్‌కు చెందిన కౌన్సిలర్ మీర్ నజీర్ అలీ తదితరులు ఈ దాడులకు పాల్పడ్డినట్టు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు కొందరు బీజేపీ నాయకులు తోడైనట్టు ఆయన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన పోలీసులను కోరారు.



కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్త మోసిన్

## లోకం పోకడ



తప్పంతా వీడిదే సార్.. సంచులు తారుమారు చేశాడు.. ప్రచారానికి ఈ హామీల సంచికి బదులు పొరపాటున ఓటర్లకు పంచే డబ్బుల సంచి పట్టుకొచ్చాడు..!

### రానున్న మూడురోజులు వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రెండు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాల కారణంగా రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. గురువారం నుంచి ఈ నెల 26 వరకు హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది. ఏపీలో ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

### చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 16.2°c | 32.9°c |
| ఆదిలాబాద్ | 16.5°c | 35.2°c |
| మెదక్ | 17.3°c | 33.1°c |
| నల్లగొండ | 19.4°c | 34.6°c |
| నిజామాబాద్ | 20.5°c | 31.9 °c |
| కరీంనగర్ | 22.0°c | 32.0°c |
| వరంగల్ | 22.0°c | 31.0°c |
| మహబూబ్‌నగర్ | 22.4°c | 32.3°c |
| ఖమ్మం | 23.0°c | 31.0°c |
| హైదరాబాద్ | 24.0°c | 30.0°c |

# 8 కోట్ల తీగలాగితే.. కదిలిన 200 కోట్ల డొంక!

**కాంగ్రెస్ నేత వివేక్ అక్రమాలు బట్టబయలు**
**నకిలీ సంస్థను స్థాపించి భారీగా మోసాలు**

- ఆదాయం 20 లక్షలు.. అప్పులు 64 కోట్లు, అక్రమ లావాదేవీలు 200 కోట్లు
- విజిలెన్స్ సెక్యూరిటీస్‌లో అక్రమాలు
- ఈడీ సోదాల్లో అక్రమ ఆస్తులు, అనుమానాస్పద డాక్యుమెంట్లు లభ్యం
- సోదరుడు వినోద్ పాత్రపై అనుమానాలు
- ఉప్పల్ క్రికెట్ స్టేడియం నిర్మాణంలో జరిగిన అక్రమాలు
- కావాలనే పనులు ఆలస్యం.. పెరిగిన ఖర్చు
- వివేక్‌పై ఫెమా చట్టం కింద కేసు నమోదు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేత, చెన్నూరు అభ్యర్థి జీ వివేకానంద (వివేక్) అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణలో తన ధన రాజకీయాన్ని చలాయించాలనుకున్న వివేక్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. విజిలెన్స్ సెక్యూరిటీ పేరుతో ఆయన చేస్తున్న కోట్ల రూపాయల మోసాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. ఆయన హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ నుంచి జరిగిన రూ.8 కోట్ల నగదు బదిలీపై రాష్ట్ర పోలీసులు ఇచ్చిన సమాచారంతో కూపీలాగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అతని దొంగ కంపెనీల నుంచి జరిగిన రూ.200 కోట్ల అక్రమ లావాదేవీలు బయటపడ్డాయి. దీంతో వివేక్‌పై ఫెమా చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఈడీ అధికారులు బుధవారం పత్రికా ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణలోని మంచిర్యాల, హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, సోమాజిగూడ, రామగుండంలో వివేక్‌కు చెందిన ఇండ్లు, కార్యాలయాలపై ఈడీ అధికారులు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయని ఈడీ అధికారులు తెలిపారు.

### 200 కోట్ల అక్రమ లావాదేవీలు

వివేక్‌కు చెందినవిగా చెప్తున్న హైదరాబాద్‌లోని విశాఖ ఇండస్ట్రీస్, రామగుండానికి చెందిన విజిలెన్స్ సెక్యూరిటీస్ నుంచి కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. వీటిల్లో ఎటువంటి వ్యాపార హేతుబద్ధత లేకుండానే తరచుగా సుమారు 100 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్టు తేల్చారు. ఈ డబ్బు కూడా విజిలెన్స్ సెక్యూరిటీ రాబడి కాదని వెల్లడించారు. అయితే ఈ సంస్థ నుంచి వీరికి వ్యాపారం ద్వారా కేవలం రూ.20 లక్షల ఆదాయం మాత్రమే వచ్చిందని, ఆస్తులు, అప్పులు కలిపి మొత్తం రూ.64 కోట్లకు బ్యాలెన్స్ షీట్ ఉందని గుర్తించారు. కానీ సుమారు రూ.200 కోట్లకుపైగా అక్రమ లావాదేవీలు జరిగినట్టు తాము గుర్తించామని వెల్లడించారు. ఈ రెండు కంపెనీలను కాంగ్రెస్ నేత వివేక్ ప్రత్యక్షంగా, పరోక్షంగా నియంత్రిస్తున్నట్టు ఈడీ పేర్కొన్నది. అయితే, ఈ విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థ లావాదేవీల్లో వివేఖ సోదరుడు గడ్డం వినోద్ పాత్ర కూడా ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

### ఫెమా నిబంధనలు ఉల్లంఘించి..

ఈడీ అధికారులు జరిపిన సోదాల్లో వివేక్‌కు చెందిన విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) నిబంధనలు ఉల్లంఘించినట్టు తేల్చారు. ఈ సెక్యూరిటీ సంస్థకు యశ్వంత్ రియల్టర్స్ మాతృసంస్థగా ఉందని గుర్తించారు. ఈ యశ్వంత్ రియల్టర్స్‌లో ఫెమా నిబంధనలకు విరుద్ధంగా విదేశీయుల షేర్లు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. ఇన్నాళ్లూ తన అధికారాన్ని ఉపయోగించి, ఫెమా నిబంధనలకు విరుద్ధంగా విదేశంలో వివేక్ వ్యాపార సంస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సోదాల్లో వివేక్ భార్య పేరుపై, యశ్వంత్ రియల్టర్స్ పేరు మీద భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో ఎన్నో అనుమానాస్పదమైన ఆస్తుల డాక్యుమెంట్లు, లెక్కకురాని లావాదేవీల పత్రాలు, కోట్లాది రూపాయల విలువైన డాక్యుమెంట్లు, చట్టబద్ధం కాని ఇంటర్–కార్పొరేట్ డిపాజిట్లు, వాటిపేరుపై ఉన్న భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు చెప్పారు. వీటితోపాటు భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈడీ అధికారుల దర్యాప్తులో భాగంగా విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీని ఓ బోగస్ సంస్థగా ఈడీ అధికారులు తేల్చారు. వివేక్‌పై ఫెమా చట్టం కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. త్వరలో మరిన్ని విషయాలు వెల్లడిస్తామని చెప్పారు.

### అన్నదమ్ముల అక్రమాలకు అడ్డాగా హెచ్‌సీఏ

వివేక్, వినోద్‌లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను అడ్డాగా చేసుకొని అనేక అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తున్నది. ఈడీ అధికారులు నిర్వహించిన సోదాల్లో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీగా వివిధ హోదాల్లో పనిచేసిన గడ్డం వినోద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ ఇండ్లల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. ఎస్ఎస్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం, దాని ఎండీ సత్యనారాయణ ఇండ్లలో కూడా తనిఖీలు చేపట్టారు. అక్కడ లభించిన డిజిటల్ పరికరాలు, విలువైన పత్రాలను పరిశీలించగా లెక్కలో చూపని రూ.10.39 లక్షలు వెలుగులోకి వచ్చాయి. వాటి కోసం వినోద్‌కు చెందిన ఓ ప్రాంతంలో వెతకగా అన్నదమ్ములిద్దరూ హెచ్‌సీఏను అడ్డాగా చేసుకొని అక్రమాలకు పాల్పడినట్టు వెల్లడైంది.

### రూ.20 కోట్లు దుర్వినియోగం

ఉప్పల్ క్రికెట్ స్టేడియం నిర్మాణంలో రూ.20 కోట్ల మేర జరిగిన అవకతవకలపై రాష్ట్ర ఏసీబీ వేసిన 3 చార్జిషీట్ల ఆధారంగా ఈడీ కూపీ లాగింది. దీంతో డీజీ సెట్లు, అగ్నిమాపక సామగ్రి, క్యానోపీల కొనుగోలులో తీవ్ర అవకతవకలు జరిగాయని గుర్తించింది. స్టేడియం నిర్మాణానికి సంబంధించిన పనులు విపరీతమైన జాప్యం కారణంగా ఖర్చులు, నిర్మాణ వ్యయం పెరిగి హెచ్‌సీఏకు నష్టాలు వచ్చినట్టు గుర్తించారు. నాటి హెచ్‌సీఏ సెక్రటరీ, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఆఖరికి ఆఫీస్ బేరర్లు సైతం కుమ్మక్కు కావడంతో ఇష్టారాజ్యంగా టెండర్లు దక్కించుకుని మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలు చూపి, కాంట్రాక్టర్లకు పనులు కేటాయించినట్టు వెల్లడైంది. రశీదు కంటే ముందే కొటేషన్లు ఇచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో చాలామంది కాంట్రాక్టర్లకు ముందస్తుగా కోట్లాది రూపాయలు చెల్లింపులు జరిగినా వారి ద్వారా ఎలాంటి పనులు జరగలేదని వెల్లడైంది. హెచ్‌సీఏలో జరిపిన సోదాల్లో విశాఖ ఇండస్ట్రీస్, దాని గ్రూప్ కంపెనీలు, వారి రియల్ ఎస్టేట్ కార్యకలాపాల లొసుగులు బయటపడ్డాయి. వీటిపై లోతుగా విచారణ జరుగుతుందని, త్వరలోనే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఈడీ అధికారులు చెప్పారు.



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బహిరంగ సభలో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్ప

## గ్యారెంటీల అమలులో కర్ణాటక సర్కారు విఫలం

- తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మొద్దు
- జహీరాబాద్ సభలో కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్ప

జహీరాబాద్, నవంబర్ 22: కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్ప ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరి కాలనీలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఆలోచన చేసి ఓట్లు వేయాలని సూచించారు. కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్య విఫలమయ్యారని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం డీకేల మధ్య విభేదాలు ఉండటంతో రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా సాగుతున్నదని వివరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం దివాలా దిశగా నడుస్తున్నదని పేర్కొన్నారు. సీఎం పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలు, కుమ్ములాటలు జరుగుతున్నాయని, ఆ పార్టీ నేతలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి పదవుల కోసం రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి మోసపోవద్దని యెడియూరప్ప పిలుపునిచ్చారు. ఈ సభలో కర్ణాటక మాజీ సీఎస్, బీజేపీ నేత రత్నప్రభ, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి రాంచందర్, నాయకులు సుమిత్ర, శ్రీనివాస్‌గౌడ్, జనార్దరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తో దివాలా దిశగా కర్ణాటక

**మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్ప**

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనతో కర్ణాటకలో ప్రభుత్వం దివాలా దిశగా నడుస్తున్నదని ఆ రాష్ట్ర మాజీ సీఎం యెడియూరప్ప పేర్కొన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీలంటూ అబద్ధపు హామీలతో కర్ణాటక ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తీరా గెలిచిన తర్వాత అవి అమలు కావడం లేదని చెప్పారు. మొత్తంగా కర్ణాటక సర్కార్ దివాలా దిశగా నడుస్తున్నదని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు కర్ణాటక తరహాలోనే గ్యారెంటీ పథకాలంటూ తెలంగాణలో ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హామీలను తెలంగాణ ప్రజలు నమ్మి మోసపోవద్దని కోరారు.



నాచారంలోని ఆటో వర్కర్స్ యూనియన్ ఆఫీస్‌లో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు మారయ్య

## రేపు ఆటో కార్మికుల 'కృతజ్ఞత సభ'

**ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య**

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మోటర్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం బంజారాహిల్స్ తెలంగాణ భవన్‌లో 'కృతజ్ఞత సభ' నిర్వహించనున్నట్టు ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య వెల్లడించారు. నాచారంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆటోలకు ఫిట్‌నెస్ చార్జీలను రద్దు చేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడాన్ని హర్షిస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ సభ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ పాల్గొంటారని వివరించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న రాష్ట్రపతి

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో పర్యటించారు. పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ముకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్రమంత్రి ఉషా శ్రీచరణ్, ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రశాంతి నిలయానికి చేరుకుని సత్యసాయి మహాసమాధిని రాష్ట్రపతి దర్శించుకున్నారు. ఆ తర్వాత పుట్టపర్తిలో సాయిహీరా ఇంటర్నేషనల్ సెంటర్‌కు రాష్ట్రపతి చేరుకున్నారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని 14 మందికి డాక్టరేట్లు, 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. అనంతరం రోడ్డు మార్గాన సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు.

### ప్రత్యేకహోదా కోసం బీహార్ మంత్రివర్గం తీర్మానం

పాట్నా, నవంబర్ 22: బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని నితీశ్ ప్రభుత్వం మరోసారి డిమాండ్ చేసింది. హోదా కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ క్యాబినెట్‌లో ఓ తీర్మానాన్ని ఆమోదించింది. బీహార్‌లో నివసిస్తున్న వారిలో దాదాపు 94 శాతం కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని సీఎం నితీశ్ తెలిపారు.

### బ్రిక్స్‌కు పాక్ దరఖాస్తు

బీజింగ్, నవంబర్ 22: బ్రిక్స్ కూటమిలో సభ్యత్వానికి పాకిస్థాన్ దరఖాస్తు చేసింది. ఈ విషయంలో మద్దతు ఇవ్వాలని రష్యాను కోరినట్టు మాస్కోలోని పాక్ రాయబారి మహమ్మద్ ఖలీద్ జమాలి తెలిపారు. ఐదు అభివృద్ధి చెందుతున్న దేశాలు బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాకు సంక్షిప్త రూపమే బ్రిక్స్. వచ్చే ఏడాది తమను కూడా కూటమిలో చేర్చాలని పాక్ కోరుతున్నది.

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### ఎస్‌బీఐలో ఆఫీసర్ పోస్టులు

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 5447
- పోస్టులు: సర్కిల్ బేస్డ్ ఆఫీసర్
- అర్హతలు: డిగ్రీ ఉత్తీర్ణత. బ్యాంకింగ్ రంగంలో రెండేండ్ల అనుభవం. వయస్సు 21- 30 ఏండ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 12
- వెబ్‌సైట్: https://www.sbi.co.in

### ఐడీబీఐలో...

**ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 2100
- పోస్టులు: జూనియర్ అసిస్టెంట్ మేనేజర్/ ఎగ్జిక్యూటివ్, సేల్స్ అండ్ ఆపరేషన్స్ (కాంట్రాక్ట్ ప్రాతిపదికన)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 6
- వెబ్‌సైట్: https://www.idbibank.in

### ఐఐటీబీలో...

**ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీబీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 42
- పోస్టులు: చీఫ్ ఇంజినీర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, లైబ్రరీ ఆఫీసర్, జేఏవో
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 21
- వెబ్‌సైట్: https://www.iitb.ac.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్ పాలిటీ, భౌతిక శాస్త్రం (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.